

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

# జనవరిలో ఆపరేషన్ స్మైల్ స్పెషల్ డ్రైవ్

- నెల రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- బాల కార్మిక వ్యవస్థ నిర్మూళనలో భాగస్వామ్యం కావాలి
- ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, డిసెంబర్ 20 : నేటి బాలలే రేపటి పౌరులు కావునా బాలలకు మంచి భవిష్యత్ ఏర్పడేలా చూడడం అందరి బాధ్యత అని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. జనవరి నెలలో నిర్వహించే 10వ విడుత ఆపరేషన్ స్మైల్ కార్యక్రమానికి సంబంధించి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ఆపరేషన్ స్మైల్ నిర్వహణకు సూర్యాపేట సబ్ డివిజన్, కోదాడ సబ్ డివిజన్ వారిగా పోలీస్ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పోలీస్ టీమ్స్ చైల్డ్ వెల్ఫేర్, లేబర్ డిపార్ట్‌మెంట్, హెల్త్ డిపార్ట్‌మెంట్, పోలీస్ టీమ్స్, ఐసీడీఎస్, భరోసా సెంటర్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిరాధరణకు గురైన పిల్లలను గుర్తించాలన్నారు. మెకానిక్ షాప్స్, ఇండస్ట్రీలు, వలస కూలీలు, ఇటుకల తయారీ పరిశ్రమలు, మైన్స్, హోటళ్లు, దాబాలు, ఇతర అవుట్ లెట్స్ గోదాములు వంటి వాటిల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. బాలలను వేధింపులకు గురిచేసినా, వెట్టి చేయిస్తున్నా అలాంటి వారి సమాచారాన్ని పోలీస్, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, డయల్ 100, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ రవి, సీడబ్ల్యూసీ చైర్మన్ రమణారావు, లేబర్ కమిషనర్ మంజుల, డీఎంహెచ్ఓ కోటాచలం, జిల్లా సంక్షేమాధికారి జ్యోతిపద్మ, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు రవికుమార్, నాగరాజు, నాగుల్ మీరా పాల్గొన్నారు.

# పనులను నిర్లక్ష్యం చేస్తే బ్లాక్ లిస్ట్‌లో పెడుతాం

- సూర్యాపేట కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, డిసెంబర్ 20 : మున్సిపాలిటీల్లోని పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలని, పనుల్లో నిర్లక్ష్యం వహించే ఏజెన్సీలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని, ఆ పనులను కొత్త ఏజెన్సీలతో చేపట్టాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి, పెండింగ్ పనులు, నిధుల లభ్యతపై అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో తాగునీరు, పారిశుధ్య పనులు, జంక్షన్లలో లైటింగ్‌లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మున్సిపాలిటీల్లోని జంక్షన్లలో లైటింగ్ ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తైన వాటిని సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే వివిధ దశల్లో ఉన్న సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడొద్దని చెప్పారు. పనులు నాణ్యత ప్రమాణాల కోసం తనిఖీలు చేపట్టాలన్నారు. ఎల్ఆర్ఎస్ నిధులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని చెప్పారు. తాగునీటి సరఫరాలో అవాంతరం ఏర్పడినా, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఓ వెంకటేశ్వర్లు, కమిషనర్లు రామానుజులరెడ్డి, వెంకటేశ్వర్‌నాయక్, దండు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

## మాదక ద్రవ్యాల నివారణకు పటిష్ట చర్యలు

మాదక ద్రవ్యాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆదేశించారు. యువత మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా చూడాలని అలాగే జిల్లా స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎస్పీ రాహుల్ హేగ్డేతో కలిసి బుధవారం కలెక్టరేట్‌లో నార్కోటిక్ నిరోధక కో– ఆర్డినేషన్ కమిటీ జాయింట్ యాక్షన్ ప్లాన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా సరిహద్దుల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. పోలీస్, ఎక్సైజ్, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి మాదక ద్రవ్యాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత, డీఎస్పీ రాములు, డీఎంహెచ్ఓ కోటాచలం, డీపీఓ యాదయ్య, డీఏఓ రామారావునాయక్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఆర్డీఓలు జగదీశ్‌రెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

# సెంట్రల్ లైటింగ్ పునరుద్ధరణ

అర్వపల్లి, డిసెంబర్ 20 : సూర్యాపేట–జనగామ 365బి జాతీయ రహదారిపై అర్వపల్లి మండల కేంద్రంలో పది రోజులుగా సెంట్రల్ లైటింగ్ పని చేయడం లేదు. విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్ ఎస్.వెంకట్రావ్‌తో మాట్లాడి లైటింగ్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ ఆదేశాలతో డీపీఓ యాదయ్య బుధవారం సెంట్రల్ లైటింగ్‌ను పరిశీలించారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో మాట్లాడి లైటింగ్ పునరుద్ధరణకు ఆదేశించారు. దాంతో లైటింగ్‌ను పునరుద్ధరించారు. కార్యక్రమంలో తాసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీఓ సందీప్ కుమార్, బైరబోయిన రామలింగయ్య, కృష్ణమూర్తి, బాలయ్య పాల్గొన్నారు.



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ యాదయ్య

## బడి బయటి పిల్లల సర్వే

నూతనకల్, డిసెంబర్ 20 : బడి బయట ఉన్న పిల్లల వివరాలను పెదనెమిల క్లస్టర్ సీఆర్పీ కనకం రవీందర్ సేకరిస్తున్నారు. బుధవారం మండలంలోని పెదనెమిల గ్రామంలో ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. వచ్చే నెల 14 వరకు సర్వే జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంపుతో పాటు బడీడు పిల్లలను బడిలో చేర్పించేలా చూసేందుకే సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఎమర్జెన్సీని తలపిస్తున్న బీజేపీ సర్కారు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

బొౖడాయిబజార్, డిసెంబర్ 20 : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌ను సొంత పార్టీ కార్యాలయంలా వాడుకుంటూ బిల్లులు, చట్టాలపై చర్చ లేకుండా నిరంకుశంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష పార్టీల ఎంపీలను సస్పెండ్ చేయడం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం తీరు ఎమర్జెన్సీని తలపించేలా ఉన్నదన్నారు. పార్లమెంట్ నుంచి ప్రతిపక్ష పార్టీల ఎంపీలను బహిష్కరించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ 22న దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, సగారపు పాండు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

## రైతు బంధుకు దరఖాస్తులు

నూతనకల్, డిసెంబర్ 20 : అర్హులైన రైతులు రైతు బంధు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీబాబు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ధరణి పోర్టల్‌లో కొత్తగా పట్టా చేసుకున్న రైతులు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతో దరఖాస్తు ఫామ్ జత చేసి వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందించాలని తెలిపారు. సమావేశంలో ఏఈఓలు జానయ్య, శ్రావణి, మధు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

మద్దిరాల, డిసెంబర్ 20 : మండలంలోని చందుపట్లకు చెందిన పాల్వాయి యాదయ్య అనారోగ్యంతో వారం రోజుల క్రితం మృతి చెందాడు. కుటుంబ సభ్యులను బుధవారం గ్రామస్తులు పరామర్శించి రూ.30 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, అంజయ్య, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.



అయోధ్య రాముడి తలంబ్రాలతో ధర్మ జాగరణ కమిటీ సభ్యురాలు అలివేలు మంగ

## గడప గడపకూ అయోధ్య రాముడి అక్షింతలు

- ధర్మ జాగరణ కమిటీ సభ్యురాలు అలివేలు మంగ

నాగారం, డిసెంబర్ 20 : అయోధ్యలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను మండలంలోని ప్రతి గడపకు అందించనున్నట్లు ధర్మ జాగరణ కమిటీ సభ్యురాలు జక్కుల అలివేలు మంగ తెలిపారు. అయోధ్య రాముడి అక్షింతలు బుధవారం మండలానికి చేరుకున్న సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అక్షింతలకు ఫణిగిరి రామాలయంలో ప్రత్యేక పూజలు జరిపి మండలంలోని 14 గ్రామాలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ 22న ఆయా గ్రామ పంచాయతీల నుంచి ఐదుగురు వచ్చి ఫణిగిరి రామాలయం నుంచి అక్షింతలు తీసుకెళ్లి గ్రామాల్లో పంపిణీ చేయాలని పేర్కొన్నారు.

## అక్రమాలపై ఉక్కుపాదం

- డీఎస్పీ నాగభూషణం

తుంగతుర్తి, డిసెంబర్ 20 : పీడీఎస్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా అలాగే మాదక ద్రవ్యాల రావాణా, వినియోగంపై కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమాచారం అందజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ఏఎస్ఐ రామకోటి సుధాకర్, నాగరాజు, వెంకన్న, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ నాగభూషణం

# తెలంగాణ ప్రజా నాట్య మండలి జిల్లా నూతన కమిటీ

బొౖడాయిబజార్, డిసెంబర్ 20 : తెలంగాణ ప్రజా నాట్య మండలి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా హుజూర్‌నగర్‌కు చెందిన దొంతగాని సత్యనారాయణ నియమితులయ్యారు. జిల్లా నూతన కమిటీని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ ప్రజా నాట్య మండలి సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జి దూళిపాళ ధనుంజయనాయుడు బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా తుంగతుర్తి నియోజక వర్గానికి చెందిన జంపాల మల్లయ్య, ఆఫీస్ బేరర్స్‌గా ఆర్.అన్నమ్మ, గురుస్వామి, ఎడెల్లి శ్రీకాంత్, అల్లిక లింగయ్య నియమితులయ్యారు.



ప్రజానాట్య మండలి నూతన కమిటీని ప్రకటిస్తున్న ధనుంజయనాయుడు

## విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు తొలిమెట్టు

- ఎంఈఓ రాములునాయక్

నూతనకల్, డిసెంబర్ 20 : ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రాములునాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని పెదనెమిల, దిర్శనపల్లి గ్రామాల్లోని పాఠశాలలను ఆయన సందర్శించి తరగతి గదుల్లో అధ్యాపకుల బోధన తీరును పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి అభ్యసన సామర్థ్యాలను పెంచాలని ఈ సందర్భంగా సూచించారు.

## క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

సూర్యాపేట రూరల్, డిసెంబర్ 20 : ఉమ్మడి నల్లగొండ జిల్లా ఖోఖో టీమ్ క్రీడాకారులకు మండల పరిధిలో బాలెంల గ్రామానికి చెందిన శివరాత్రి భిక్షం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శేఖర్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. బుధవారం బాలెంల గ్రామ ఉన్నత పాఠశాలలో దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.